# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం — జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 12 | ఆదివారం | 9-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:12 | Sunday | 9-8-2026 | Pages:08 | Cost:2/- |







# ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు

- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ
- ప్రధాని ప్రసంగం తమను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పిన గోల్డ్ మెడలిస్టులు
- ఓ సీనియర్ మాట్లాడినట్టు అనిపించిందని విద్యార్థుల హర్షం
- క్యాంపస్, హాస్టల్ జీవితంలోని చిన్న విషయాలు ప్రస్తావించడంపై ఆశ్చర్యం



శనివారం జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై గోల్డ్ మెడల్ విజేతలు ప్రశంసలు కురిపించారు. ఆయన తమతో ఒక దేశ ప్రధానిలా కాకుండా, తమ క్యాంపస్‌కు చెందిన ఒక సీనియర్‌లా మాట్లాడటం తమను ఎంతగానో ఆకట్టుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలను మాత్రమే కాకుండా, దేశ సేవ చేయాలనే లక్ష్యాన్ని కూడా తమతో పాటు తీసుకెళ్తున్నారని ఆయన ఆకాంక్షించారు. ఈ స్నాతకోత్సవంలో 587 మంది పీహెచ్‌డీ స్కాలర్‌లతో సహా మొత్తం 3,000 మందికి పైగా విద్యార్థులు తమ పట్టాలను అందుకున్నారు.

- మిగతా 2వ పేజీలో



# భూసేకరణకు రూ.5 వేల కోట్లు

## ఇప్పటికే రూ. 2 వేల కోట్లు విడుదల.. త్వరలో మరో రూ.3 వేల కోట్లు

## ఉమ్మడి కరీంనగర్‌లోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

హైదరాబాద్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం--పునర్నిర్మాణానికి నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఇందుకోసం రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల కాగా.. మరో రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నిధుల కొరతతో పూర్తికి చేరువైన ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోకూడదని స్పష్టం చేశారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న

- మిగతా 2వ పేజీలో



# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

2లో

# చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక
- ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం



ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి.

- మిగతా 2వ పేజీలో



2లో

# వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

- వ్యవస్థతో ద్వేషంతో కాదు, ప్రేమతో పోరాడాలన్న రాహుల్ గాంధీ
- దేశంలో తీవ్ర ఉద్యోగ సంక్షోభం ఉందని ఆందోళన
- సంస్థలన్నింటినీ ఒకే పార్టీ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపణ
- రాహుల్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లిన విద్యార్థులు
- దేశంలో 'మొహబ్బత్ కీ దుకాణ్' తెరవాలని యువతకు పిలుపు

# మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారు..

లోకేశ్ రాజీనామా చేయాలి

డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలన్న రోజా

లంచాలు తీసుకుని అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపణ

ప్రధాని మోదీ స్పందించి చర్యలు తీసుకోవాలన్న రోజా

# 7,340 ఇళ్లు.. 35,125 దరఖాస్తులు

ఇందిరమ్మ టవర్స్‌కు భారీ స్పందన

దరఖాస్తుకు మరో రెండు రోజులే గడువు

ఈనెల 20 తర్వాత లాటరీ ప్రక్రియ

# ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు..

- కాల్వలు తవ్వకుండానే అంకితమిచ్చారు: జూపల్లి
- రాజకీయాల కోసం ప్రాజెక్టుల అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తెస్తోందన్న జూపల్లి
- పాలమూరు ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ
- పాలమూరు-రంగారెడ్డి పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారని మండిపాటు



2లో



అస్సాం వరదలు.. 98 మంది మృతి

## వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

దేశంలోని వ్యవస్థలో మార్పు కోసం ద్వేషంతో కాకుండా ప్రేమతో పోరాడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు పిలుపునిచ్చారు. దేశంలో ఉద్యోగ అవకాశాలు కనుమరుగయ్యాయని, కీలక రాజ్యాంగబద్ధ సంస్థలను ఒకే పార్టీ తన గుప్పిట్లో పెట్టుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరిగిన 'ఛాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఏ విద్యార్థి హృదయంలోనూ ద్వేషం ఉండకూడదు, కేవలం ప్రేమ మాత్రమే నిండి ఉండాలి. మనం ప్రేమ, ఆప్యాయతలతోనే వ్యవస్థను ప్రక్షాళన చేయాలి" అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 'మొహబ్బత్ కీ దుకాణ్' (ప్రేమ దుకాణం) తెరవాలని యువతకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి, వ్యయ ప్రయాసలకోర్చి చదువుకున్నా ఉద్యోగ అవకాశాలు లభించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి నిర్ణయాల ఫలితంగా 'మేడ్ ఇన్ ఇండియా' అన్నది ఎక్కడా కనిపించడం లేదని, మార్కెట్లో కేవలం చైనా, వియత్నాం ఉత్పత్తులే రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. ఒకప్పుడు రూ. 150 కోట్ల నిధులు కలిగిన ఒక రాజకీయ పార్టీకి ఇప్పుడు రూ. 10,000 కోట్లకు పైగా నిధులు చేరాయని, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారిని వైస్-ఛాన్సలర్లుగా నియమిస్తూ విశ్వవిద్యాలయాలను, ఇతర కీలక సంస్థలను తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. అలహాబాద్ యూనివర్సిటీ లైబ్రరీ వర్షపు నీటిలో మునిగిపోతోందని, దీనిపై నిరసన వ్యక్తం చేస్తే దాడులు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఓ న్యాయశాస్త్ర విద్యార్థి ఆయనకు వివరించారు. యూపీపీఎస్సీ పరీక్షల్లో 'నార్మలైజేషన్' ప్రక్రియపై కొందరు, 2018 నుంచి ఉపాధ్యాయ నియామకాలు పూర్తి కాకపోవడంపై మరికొందరు తమ గోడును వెళ్లబోసుకున్నారు. విద్యార్థులు వివరించిన సమస్యలను ఓపికగా విన్న రాహుల్ గాంధీ, నిర్మాణాత్మక పోరాటం ద్వారానే లక్ష్యాలను సాధించవచ్చని వారికి సూచించారు.

## మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారు.

ఏపీ డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా డిమాండ్ చేశారు. వైసీపీ పిలుపు మేరకు నగరిలో చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ అక్రమాలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. మెరిట్ ఉన్న అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, లంచాలు దండుకుని అనర్హులకు కట్టబెట్టారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలపై మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ దీక్షా శిబిరాలపై కోడిగుడ్లతో దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని రోజా మండిపడ్డారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ... డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించే వరకు నిరసనలు ఆపేది లేదని, తిరుపతిలో త్వరలోనే భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు.

## ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు..

తెలంగాణ తాగు, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే కనీస అర్హత కూడా బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ ప్రాజెక్టుల అంశాన్ని తెరపైకి తెస్తోందని ఆరోపించారు. జూరాలలో ఉన్న ప్రసుత నీటిమట్టంతో మొత్తం ఆయకట్టుకు నీరు అందించడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని తెలిపారు.పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాజెక్టులను బీఆర్ఎస్ పట్టించుకోలేదని మంత్రి మండిపడ్డారు. రూ.80 వేల కోట్లు పట్టే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేవలం రూ.19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, కనీసం కాల్వలు కూడా తవ్వకుండానే జాతికి అంకితం ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 68.5 శాతం వాటా రావాల్సి ఉండగా... కేసీఆర్ హయాంలో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకు మాత్రమే కేటాయింపులు జరగ్గా... ఏపీకి 512 టీఎంసీలు దక్కేలా చేశారని మంత్రి మండిపడ్డారు.

# అస్సాం వరదలు.. 98 మంది మృతి

గువాహటి: అస్సాం రాష్ట్రాన్ని భారీవరదలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వానల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 98కి చేరుకోగా.. 1.55 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 1,55,849 మంది వరదల ప్రభావానికి గురైనట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వరదల కారణంగా 13 జిల్లాలు శివసాగర్, గోలాఘాట్, నాగావ్, హోజాయ్, సోనిత్‌పూర్, ధేమాజీ, దర్రాంగ్, బిశ్వనాథ్, కామ్రూప్ , లఖింపూర్, ఉదల్గురి, జోర్హాట్, చరైడియోలో అధికంగా ప్రభావితమయ్యాయి.

**గోలాఘాట్‌లో అత్యధిక ప్రభావం**

వరదల ప్రభావం గోలాఘాట్ జిల్లాలో అత్యధికంగా ఉంది. అక్కడ 58,750 మంది వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ తర్వాత శివసాగర్‌లో 48,286 మంది, జోర్హాట్‌లో 25,259 మంది ప్రభావితమయ్యారని అక్కడి ప్రభుత్వం వివరాలు ప్రకటించింది. వరదల ఉద్ధృతిని ఎదుర్కొవడానికి 55 సహాయ శిబిరాలు ఏర్పాటు చేయగా అందులో 10 వేల మందికి పైగా ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపింది. వరదల కారణంగా 10,748.64 హెక్టార్ల పంట భూమి నీట మునిగింది. అలాగే 47,000కు పైగా పశువులు వరదల ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు.





కాగా ఆగస్టు 9 నుంచి 30వ తేదీ వరకు వరదల వల్ల నష్టం అంచనా ప్రక్రియ కొనసాగుతుందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శుక్రవారం తెలిపారు.

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

(మొదటి పేజీ తరువాయి)



గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## 7,340 ఇళ్లు.. 35,125 దరఖాస్తులు

అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో క్యూర్ పరిధిలో తలపెట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకానికి భారీ స్పందన వస్తోంది. ఈ ఫ్లాట్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఇందిరమ్మ టవర్స్ కింద మొత్తం లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలోనూ 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోంది. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ ఇళ్ల కోసం శనివారం సాయంత్రానికి 35,125 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నట్లు వివరించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58లక్షల వరకు ధర పలికే ఈ ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్న ఉద్దేశంతో కేవలం రూ.6 లక్షల రూపాయలకే ప్రభుత్వం కేటాయిస్తోందని ఆయన తెలిపారు.

## ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు

(మొదటి పేజీ తరువాయి)

'పర్ఫెక్ట్ టెన్' గోల్డ్ మెడల్ గ్రహీత అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "ఆయన ప్రసంగించిన తీరు మాతో పూర్తిగా కనెక్ట్ అయ్యింది. మేం మా ప్రధాని ప్రసంగాన్ని వింటున్నట్లు కాకుండా, ఒక సీనియర్ మాతో మాట్లాడుతున్నట్లుగా అనిపించింది" అని పేర్కొన్నారు. మరో గోల్డ్ మెడలిస్ట్ అక్షత్ సింఘాల్ మాట్లాడుతూ.. క్యాంపస్‌లోని 'నైట్ మెస్', జియా సరాయ్‌లో పోహా తినడం వంటి చిన్న అంశాల గురించి కూడా ప్రధానికి తెలియడం తమకు ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రామిరెడ్డి వెంకట సాయి రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "హాస్టల్‌లో తెల్లవారుజామున 3 గంటలకు జరిగే విషయాలను సైతం ప్రధాని ప్రస్తావించారు. ఇంతటి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి మా క్యాంపస్ జీవితంలోని చిన్నచిన్న క్షణాలను గుర్తుంచుకోవడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది" అని వివరించారు.

# భూసేకరణకు రూ.5 వేల కోట్లు



సిరిసిల్ల జిల్లాల పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇతర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్‌లు సీహెచ్ విజయ రమణారావు, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీలు భాను ప్రకాశ్ రావు, అంజిరెడ్డి, ఎల్. రమణ, నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూసేకరణ, పునరావాసం--పునర్నిర్మాణం, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ అంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్యంగా పరిష్కరించాలని కలెక్టర్లను ఉత్తమ్ ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆర్థిక అనుమతులు, నిధుల విడుదలకు సంబంధించిన ప్రక్రియలో జాప్యం చేయొద్దన్నారు. ఇంజనీరింగ్ పనులు కొనసాగుతూనే.. వీలైన ప్రాంతాల్లో భూసేకరణ, భూ యజమానులకు పరిహారం, నిర్వాసిత కుటుంబాలకు పునరావాస చర్యలను సమాంతరంగా చేపట్టాలని సూచించారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. భూసంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, చట్టబద్ధ అనుమతుల ప్రక్రియలను సమాంతరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించి పనులు మళ్లీ నిలిచిపోకుండా చూడాలన్నారు.పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఉత్తమ్ ఆదేశించారు. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం చేకూరనుందన్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని, ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం అని మంత్రి చెప్పారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా రూపొందించాలని ఉత్తమ్ ఆదేశించారు.



## గ్రామ మౌలిక వసతులే ప్రధాన లక్ష్యం

- రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- పెద్ద రావులపల్లి సర్పంచ్ మోటె బాలకృష్ణ యాదవ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్ద రావులపల్లి సర్పంచ్ మోటె బాలకృష్ణ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని పెద్ద రావులపల్లి గ్రామంలో శనివారం రూ.5 లక్షల ఉపాధి హామీ (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన ప్రజాప్రతినిధులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్థుల సహకారంతో పెద్ద రావులపల్లిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో మురుగునీటి కాలువలు, అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వర్కాల బాలచందర్ గౌడ్, వార్డు సభ్యులు జడల రాజు యాదవ్, వంగూరి నరసింహ, పంతంగి మారయ్య, కందాల శంకరయ్య, గుండె శ్రీను, అజయ్, కొండల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

- ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్
- సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన తడక వెంకటేశ్వర్లు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** విద్యార్థుల సంక్షేమం, భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు తెలిపారు. పురపాలక కేంద్రంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) బాలికల వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలను పరిశీలించి, విద్యార్థినులతో ముచ్చటించారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజన నాణ్యత, కల్పిస్తున్న వసతులపై విద్యార్థినులను ఆరా తీశారు. అనంతరం వార్డెన్, సిబ్బందితో మాట్లాడుతూ వసతి గృహంలో ఎదురవుతున్న సమస్యల వివరాలను సేకరించారు. విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేర్‌టేకర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత స్నేహితుడికి పూర్వ విద్యార్థుల ఆసరా

- రూ. 25 వేల ఆర్థిక సాయం, నిత్యవసరాల పంపిణీ
- జెడ్పీహెచ్ఎస్ 1992-93 బ్యాచ్ స్నేహితుల ఉదారత



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 1992-93 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మిత్రధర్మాన్ని చాటుకున్నారు. తమతో పాటు చదువుకున్న తోటి మిత్రుడు ఎంబ వెంకటేష్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు స్పందించారు. శనివారం బాధిత కుటుంబానికి రూ. 25,000 ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తోటి స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని తెలిసి తమవంతుగా బాసటగా నిలిచామని తెలిపారు. ఆపదలో ఉన్న మిత్రుడికి తోడ్పాటు అందించడం తమ బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మైల ఐలయ్య, ఉపాధ్యక్షుడు చిక్కమంగ, ప్రధాన కార్యదర్శి ఆట సత్యనారాయణ, కోశాధికారి దోర్నాల గణేష్, సభ్యులు కర్నాటి నరసింహ, చెక్క అశోక్, రుద్ర చెన్నకేశవులు, ఏలే శ్రీనివాస్, ప్రభాకర్, గుద్దేటి పాండు, గరిస జంగయ్య, భావన రుషి, నాగులు, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- అంజమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన వాకిటి అనంతరెడ్డి
- దహన సంస్కారాల కోసం రూ. 5 వేలు అందజేత



**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన నిరుపేద బత్తిని అంజమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి గ్రామానికి చేరుకుని మృతురాలి పార్థివదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మృతురాలి కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల స్వామి, కొడితల కరుణాకర్, శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం డైరెక్టర్ దామెర అంజయ్య, రేఖ మచ్చి, వేముల అనిల్, ఎర్ర సాయి, ఆకుల మత్స్యగిరి, జినుకల మల్లేష్, మర్రి ముత్యాలు, మారగొని శ్రీను, మాటూరి సాయి, బత్తిని నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కత్ సిరి.. ప్రపంచానికే సరి

- చేనేత వస్త్రాల ప్రాభవాన్ని చాటాలి: రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్ రేష్మి ఠాకూర్
- పోచంపల్లిలో 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' పైలట్ ప్రాజెక్ట్ సందడి
- తరలివచ్చిన 40 మంది ఎంఎన్‌సీ అధికారులు, ఫ్రాన్స్ కాన్సులేట్ ప్రతినిధులు







**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల గొప్పతనాన్ని, నైపుణ్యాన్ని ప్రపంచ నలుమూలలా విస్తరించేలా చేయాలని మిస్ ఆసియా పసిఫిక్, రాష్ట్ర చేనేత బ్రాండ్ అంబాసిడర్ రేష్మి ఠాకూర్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శనివారం చేపట్టిన "ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి" పైలట్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా మల్టీనేషనల్ కంపెనీల ఉన్నతాధికారులు, ఫ్రాన్స్ కాన్సులేట్ ప్రతినిధులు, సోషల్ మీడియా ప్రతినిధులు సహా దాదాపు 40 మంది ప్రతినిధుల బృందం పోచంపల్లిని సందర్శించింది. ఈ సందర్భంగా పర్యాటక పార్కులో అతిథులకు ఇక్కత్ దారాలతో తయారు చేసిన పూలమాలలు, తిలకధారణతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం చేనేత మ్యూజియంలో వస్త్ర తయారీ లఘుచిత్రాన్ని తిలకించి, నేరుగా కార్మికుల గృహాలను సందర్శించి ఫ్రేమ్, గుంత మగ్గాలపై నూలు నుంచి వస్త్రం తయారయ్యే విధానాన్ని పరిశీలించారు.

**యూకే పార్లమెంట్‌లో ఇక్కత్ ముద్ర:**

ఈ సందర్భంగా రేష్మి ఠాకూర్ మాట్లాడుతూ.. పోచంపల్లి వస్త్రాల ఖ్యాతిని పెంపొందించేందుకు ప్రతిష్ఠాత్మక యూకే పార్లమెంట్‌లో 15 నిమిషాల పాటు ప్రసంగించే అరుదైన అవకాశం తనకు దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ క్యాన్స్ ప్రదర్శన ద్వారా "ఫ్రాన్స్ టు పోచంపల్లి" నినాదంతో ఇక్కత్ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్నామని చెప్పారు. నేత కార్మికులు కేవలం చీరల తయారీకే పరిమితం కాకుండా నేటి యువత ట్రెండ్‌కు తగ్గట్టుగా కుర్తాలు, లేహంగాలు, ఆధునిక ఫ్యాషన్ డిజైన్లతో స్టిచ్చింగ్ కూడా ఇక్కడే చేసి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం కార్మికులకు నూతన డిజైన్లపై శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రతినిధుల బృందం స్థానిక శివారెడ్డిగూడెంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి కూలీలతో కలిసి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, చేనేత-జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు (ఏడీ) ఎ.శ్రీనివాసరావు, టూరిజం కన్సల్టెన్సీ ప్రతినిధి సాహితీ, ఎన్ఐయూఎం ప్రతినిధి నిత్య, సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, వెంకటరమణ సిల్క్ సొసైటీ అధ్యక్షుడు చింతకింది రమేష్ తదితరులు పాల్గొన్నారు.







## 3వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండమీది వెంకటేష్

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఆకుల ఇంద్రసేనరెడ్డి, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు (లింగోజిగూడెం) కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడిగా బండమీది వెంకటేష్ నియమితులయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనరెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి కలిసి బండమీది వెంకటేష్‌ను వార్డు అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు, వార్డు స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. వెంకటేష్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనరెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డికి బండమీది వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తల సహకారంతో అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## మీసేవ అభ్యర్థులకు వ్రాత పరీక్ష

- ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణ
- హాజరైన 166 మంది అభ్యర్థులు
- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి

**తొలివెలుగు, భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు, ఆత్మకూరు, మోత్కూరు, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లో నూతనంగా 8 మీసేవ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు శనివారం వ్రాత పరీక్ష నిర్వహించారు. భువనగిరి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మీసేవ కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మొత్తం 209 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా, 166 మంది వ్రాత పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డిఆర్‌డివో) టి.నాగిరెడ్డి పర్యవేక్షణలో పరీక్షను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇ.డి.ఎమ్ సాయి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సైదా తదితరులు పాల్గొన్నారు.



# నేడు కొయ్యలగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- పద్మజ్యోతి యువజన సంఘం, ప్రగ్మా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెంలో పద్మజ్యోతి యువజన సంఘం, వనస్థలిపురం ప్రగ్మా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక పద్మజ్యోతి యువజన సంఘం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం కొనసాగనుంది. ఈ శిబిరంలో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలతో పాటు సీబీపీ, ఆర్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్ వంటి వివిధ రకాల రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పద్మజ్యోతి యువజన సంఘం ప్రతినిధులు కోరారు.



## ఆర్‌టీఐ కమిటీ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

- నియామకాన్ని ప్రకటించిన జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్
- హక్కుల సాధనకు అంకితభావంతో కృషి చేస్తా: శ్రీనివాస్‌రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షుడిగా దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ శనివారం శ్రీనివాస్‌రెడ్డి నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్, కమిటీ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ రాఖీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ద్వారా ప్రజలకు అందాల్సిన హక్కులను సాధించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆర్‌టీఐ చట్టాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, దాని ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ తెలియజేస్తానని తెలిపారు. కమిటీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## త్వరలో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల

- వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఒక్క సీటు కూడా గెలవదన్న మంత్రి నారాయణ
- త్వరలోనే మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటన
- వైసీపీ నేతలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని తీవ్ర విమర్శ
- 16,000 టీచర్ పోస్టులు ఇచ్చినందుకా లోకేశ్ రాజీనామా చేయాల్సింది అని ప్రశ్న
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ నుంచి దృష్టి మరల్చేందుకే వైసీపీ ధర్నాలని ఆరోపణ



**అమరావతి,తొలివెలుగు** రాష్ట్రంలో త్వరలోనే మెగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ప్రకటించారు. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని, సున్నా స్థానాలకే పరిమితం కావాల్సి ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. శనివారం నెల్లూరులో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, ఆ పార్టీ నేతలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. ఉన్నత న్యాయస్థానాలు హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నందుకా లోకేశ్ రాజీనామా చేయాలని కోరుతున్నారని ఆయన ప్రశ్నించారు.దప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం ప్రాజెక్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ధర్నాలకు దిగుతోందని నారాయణ ఆరోపించారు. ఆ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, 'మావిగన్' అంటూ చేస్తున్న రాద్ధాంతాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

## ప్రాణాలు తీసిన అతివేగం ఇద్దరు దుర్మరణం

**శేరిలింగంపల్లి,తొలివెలుగు**అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన కన్నయ్యలాల్ (25), దేరామ్ (24) నగరానికి వలసవచ్చి కొల్లూరులోని ఇంద్రారెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ.. స్థానికంగా టైల్స్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12:25 గంటల సమయంలో ఇద్దరూ ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రాంగూడలోని సత్వాకు కారులో అతివేగంగా వెళ్తూ.. ఔటర్ రింగు రోడ్డు వద్ద ఉన్న నియో పోలిస్ బ్రిడ్జ్ వద్ద పిల్లర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కన్నయ్యలాల్, దేరామ్ అక్కడికక్కడే మృతి చెందారు.

## ఎంజేపీటీలో 'బోనాల' పండగ






- సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు
- తూప్రాన్‌పేట ఎంజేపీటీలో వైభవంగా బోనాల జాతర
- ఆకట్టుకున్న విద్యార్థుల పోతురాజు విన్యాసాలు
- ప్రిన్సిపాల్ బి.శిరీషారెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ దివ్య ప్రతీక అని ఎంజేపీటీ బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బి.శిరీషారెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట పరిధిలోని ఎంజేపీటీ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం బోనాలోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ నుంచి మహిళా ఉపాధ్యాయినులు నెత్తిన బోనాలు ధరించి మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు పోతురాజులు, పులి వేషధారణలతో చేసిన విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీషారెడ్డి మాట్లాడుతూ.. భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేసేందుకే విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు నిర్వహించామన్నారు. పసుపు, కుంకుమ, వేపాకులతో కొత్తకుండను అలంకరించి బోనం సమర్పించడం వెనుక ఉన్న భక్తి భావాన్ని, ఐక్యతను వివరించారు. మన సంస్కృతిని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీపీలు జి.రవికుమార్, జి.మహేందర్ రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ల అరెస్టు









- 5 తులాల పసిడి, బైక్, మొబైల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ అనురాధ

**తొలివెలుగు, నాగోల్ :** చైన్ స్నాచింగ్‌లు, వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్థులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 5 తులాల బరువుగల రెండు బంగారు మంగళసూత్రాలు, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, ఒప్పో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను శనివారం ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ అనురాధ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లాకు చెందిన అంషు కుమార్ (26), సరోజ్ కుమార్ (23), విక్రమ్ కుమార్ (23) ఉపాధి కోసం ఇటీవల హైదరాబాద్ వచ్చి యాకుత్‌పురాలో నివాసముంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నేరాలకు పథకం రచించారు. ఆగస్టు 3న మేడ్చల్‌లోని వెల్లమ్మతోట కాలనీ వద్ద పల్సర్ బైక్‌ను చోరీ చేశారు. అదే వాహనంపై ఆగస్టు 4న నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం, ఆర్.కే.నగర్‌లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచేశారు. అనంతరం ఆగస్టు 6న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో మరో మహిళ మెడలోని 5 తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించారు.

**వాహనాల తనిఖీల్లో చిక్కి..**

ఆగస్టు 7న నాగోల్ ఆనంద్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు ఒప్పుకున్నారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సీసీఎస్ ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ గోవింద్, సరూర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, సిబ్బంది సుభాష్, సాయి, లింగస్వామి, జగన్‌లను డీసీపీ అభినందించారు.

## నేలపట్ల చేనేత సంఘం చైర్మన్ ఎన్నికపై స్టే

- ముగ్గురు సంతానం ఉన్నారంటూ తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన నలుగురు డైరెక్టర్లు
- డైరెక్టర్, చైర్మన్ ఎన్నికలపై స్టే ఆర్డర్ జారీ
- ఆర్డర్ కాపీని ఏడి అధికారికి అందజేసిన కుల సంఘం ప్యానెల్

**తొలివెలుగు, చౌటుప్పల్:** నేలపట్ల చేనేత సహకార సంఘం చైర్మన్ ఎన్నిక వ్యవహారం వివాదాస్పదంగా మారింది. చైర్మన్‌గా ఎన్నికైన పిల్లలమర్రి శ్రీనివాసుకు ముగ్గురు సంతానం ఉన్నారనే అంశాన్ని ప్రస్తావిస్తూ కుల సంఘం ప్యానెల్‌కు చెందిన నలుగురు డైరెక్టర్లు తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ డైరెక్టర్, చైర్మన్ ఎన్నికలపై స్టే ఆర్డర్ జారీ చేసినట్లు వారు వెల్లడించారు. కుల సంఘం ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల జులై 10న జరిగిన నేలపట్ల చేనేత సహకార సంఘం ఎన్నికల్లో స్థానిక పద్మశాలి కుల సంఘం తరఫున ఒక ప్యానెల్, గతంలో సంఘం అధ్యక్షుడిగా కొనసాగిన పిల్లలమర్రి శ్రీనివాసు ప్యానెల్ మరో ప్యానెల్‌గా పోటీ చేశాయి. ఎన్నికల్లో కుల సంఘం ప్యానెల్ ఆరు స్థానాలను గెలుచుకోగా, పిల్లలమర్రి శ్రీనివాసు ప్యానెల్ మూడు స్థానాలను సాధించింది. అనంతరం కుల సంఘం ప్యానెల్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లు తమ వైపు రావడంతో పిల్లలమర్రి శ్రీనివాసు ఐదు ఓట్లతో చైర్మన్‌గా ఎన్నికైనట్లు కుల సంఘం ప్యానెల్ ప్రతినిధులు తెలిపారు. అయితే, చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాసుకు ముగ్గురు సంతానం ఉన్నారని, సహకార సంఘాల ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్న వ్యక్తి పోటీ చేయరాదనే నిబంధన వర్తిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఆధారంగా చేసుకుని కుల సంఘం ప్యానెల్‌కు చెందిన డైరెక్టర్లు తడక పారిజాత, పిల్లలమర్రి కిరణ్, గంజి శ్రీనివాసు, తడక కోటేశ్వర్ ఆగస్టు 5న తెలంగాణ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

**డైరెక్టర్, చైర్మన్ ఎన్నికలపై స్టే:**

వారి వాదనలు, సమర్పించిన వివరాలను పరిశీలించిన అనంతరం ట్రిబ్యునల్ జడ్జి డైరెక్టర్ ఎన్నికతో పాటు చైర్మన్ ఎన్నికపై స్టే ఆర్డర్ జారీ చేసినట్లు కుల సంఘం ప్యానెల్ సభ్యులు తెలిపారు. ఈ స్టే ఆర్డర్ ఆగస్టు 5, 2026 నుంచి అమల్లోకి వస్తుందని కోర్టు ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వారు వెల్లడించారు. ట్రిబ్యునల్ జారీ చేసిన స్టే ఆర్డర్ కాపీని యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత శాఖ ఏడి అధికారికి అందజేసినట్లు కుల సంఘం ప్యానెల్ సభ్యులు తెలిపారు. తదుపరి చర్యలు కోర్టు ఆదేశాల మేరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత మరో ప్యానెల్ లేదా సంఘం చైర్మన్ వైపు నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

## నిరుపేద కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక చేయూత

- రూ. 10 వేల సాయం అందజేసిన భీమిడి ప్రదీప్ జీ

**తొలివెలుగు, చౌటుప్పల్:** అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ ఆర్థిక చేయూత అందించారు. గ్రామానికి చెందిన ఏలే లక్ష్మమ్మ శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సర్పంచ్ శనివారం వారి నివాసానికి వెళ్లారు. లక్ష్మమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం తనవంతుగా రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టసమయంలో గ్రామంలోని పేద కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ, మాజీ ఎంపీటీసీ గంగాపురం గంగాధర్, నాయకుడు బాతరాజు లింగస్వామి, వార్డు సభ్యులు పిట్టల సదానందం, బాతరాజు నాగరాజు, చొప్పరి సాయి కుమార్, పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత: మంత్రి కొండపల్లి

**తొలివెలుగు ,విజయనగరం :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండల కేంద్రంలో రూ. 2.12 కోట్లతో నిర్మించిన కస్తూర్బా బాలికల అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాల భవన సముదాయాన్ని, రూ. 53 లక్షలతో నిర్మించిన మండల విద్యాశాఖ అధికారి భవన సముదాయాన్ని కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. పాఠశాల ప్రారంభ సమయంలోనే యూనిఫామ్, షూస్, పుస్తకాలు అందించడంతోపాటు డొక్కా సీతమ్మ పేరిట నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత కలిగించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగేలా నేర్పరితనంతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రతతో ముందుకు సాగాలని, చదువు ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కస్తూర్బా బాలికలతో పాఠశాల గదుల రిబ్బన్ కట్ చేయించి ఆయన ప్రారంభించారు. విద్యార్థుల బాగోగులు, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, భోజనాల రుచి, మౌలిక వసతుల గురించి మంత్రి కొండపల్లి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు, భాజపా నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి, పోలవరం జిల్లాల్లో గిరిజన సంఘాల బంద్



**పాడేరు టౌన్, తొలివెలుగు:** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మన్యం బంద్ ఉద్రిక్తంగా సాగుతోంది. పలు ఆదివాసీ సంఘాల నేతలు ఉదయాన్నే స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో బైఠాయించారు. బంద్ నేపథ్యంలో పోలీసులు కూడా భారీగా మోహరించారు. జీవో 3 రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయ జీవో వెంటనే జారీ చేయాలని, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు నిరసనకారులను అడ్డుతప్పించి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ముందుకెళ్లే చేశారు. బంద్ నేపథ్యంలో ప్రయాణికులు లేకుండానే బస్సులు ఖాళీగా వెళ్లాయి. జిల్లాలోని జి.మాడుగుల, పెదబయలు, ముంచంగి పుట్టు, అరకులోయ డుంబ్రిగూడ హుకుంపేట మండలాల్లో బంద్ కొనసాగుతోంది. ముంచంగి పుట్టు మండల కేంద్రంలో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా బంద్ నిర్వాహకులు రోడ్డుపై బైఠాయించి బంద్ నిర్వహించారు. ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్నపడాల్ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందర్ రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో గిరిజన సంఘాల బంద్ కొనసాగుతోంది. ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. బంద్ నేపథ్యంలో దుకాణాలు మూతపడ్డాయి.

# నోరు పారేసుకుంటే ఇళ్లకు వచ్చి కొడతాం..

**పేర్ని నానికి బొండా ఉమ తీవ్ర హెచ్చరిక**



**విజయవాడ,తొలివెలుగు:** విమర్శలు హుందాగా చేయాలని, హద్దు మీరి నోరు పారేసుకుంటే ఇళ్లకు వచ్చి కొడతామని వైసీపీ నేత పేర్ని నానితో పాటు ఆ పార్టీ నాయకులకు టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమ తీవ్రస్థాయిలో వార్నింగ్ ఇచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలపై వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. నిరసనల పేరుతో రోడ్లపైకి వచ్చి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడితే చూస్తూ ఊరుకునేది లేదని, డీఎస్సీపై చర్చకు సిద్ధమని సవాల్ చేస్తే ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదని బొండా ఉమ స్పష్టం చేశారు. "మీరు రప్పా.. రప్పా అంటే చూస్తూ ఊరుకోవాలా? మేము కనుక రౌడీయిజం చేస్తే మీరు రోడ్లపై తిరగగలరా? నా టికెట్ గురించి మాట్లాడటానికి మీరెవరు మా అధినేత చంద్రబాబు అనుకుంటే టికెట్ ఇస్తారు" అన్నారు. అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో తన నియోజకవర్గం టాప్ 8లో ఉందని తెలిపిన ఆయన, ఇకపై హద్దు మీరి ప్రవర్తిస్తే ఎక్కడికైనా వచ్చి సంగతి తేలుస్తామని హెచ్చరించారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి
- ప్రమాదంలో మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందించాలి
- 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలి
- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఎల్లగిరిలో ఘన సన్మానం





**తొలివెలుగు, చౌటుప్పల్:** కల్లుగీత కార్మికుల హక్కులు, సంక్షేమం, వృత్తి రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బి. జయరాములు, రగీరు కృష్ణ తదితరులతో కూడిన బస్సు యాత్ర బృందానికి శనివారం చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. మానుకోట నుంచి హైదరాబాద్ వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా ఎల్లగిరి గ్రామానికి చేరుకున్న బృందానికి శ్రీకంఠ మహేశ్వర గౌడ సంఘం సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర నాయకులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

**పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి:**

ఈ సందర్భంగా శ్రీకంఠ మహేశ్వర గౌడ సంఘం అధ్యక్షులు మారగోని అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా నిధులు సుమారు రూ. 20 కోట్లు వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు గీత కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు, మృతుడి భార్యకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు నెలకు రూ. 4 వేల పెన్షన్ అందించాలని, గ్రామాలు, మండల కేంద్రాల్లో తాటి, ఈత వనాల పెంపకానికి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు జీవన భద్రత కల్పించేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

**గీత వృత్తికి రక్షణ కల్పించాలి:**

శ్రీకంఠ మహేశ్వర గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి మారగోని జంగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న తాటి, ఈత చెట్లను నరికివేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కల్లుగీత వృత్తిని చేపట్టే ప్రతి గీత కార్మికుడికి కాటమయ్య రక్షణ కవచం అందించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. గీత కార్మికులంతా చైతన్యవంతమై ఐక్యంగా ముందుకు సాగాలని, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సమాజంలో ప్రత్యేక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

**భారీగా పాల్గొన్న గీత కార్మికులు:**

ఈ కార్యక్రమంలో అల్లాపూర్, కొయ్యలగూడెం, పీపాల్‌పహాడ్, డి. నాగారం తదితర గ్రామాలకు చెందిన గీత కార్మికులు పాల్గొన్నారు. పల్సమ్ అంజయ్య, మారగోని దయాకర్, పెద్దులు, పెద్ద అంజయ్య, చిన్న అంజయ్య, ప్రమీల, దేవేందర్, కృష్ణ, సత్యనారాయణ (బ్యాంక్), సత్యనారాయణ (ఆర్టీసీ), బాలరాజు, నర్సింహ, మల్లేశం, వెంకటేశం, శ్రీను, శివ, పాలెం బాషయ్య, వెంకటేష్, సత్యనారాయణ, వంగాల శేఖర్, రమేష్, కొమ్మగోని శ్రీను, తెనుగు అంజయ్య, బండిగారి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# మల్కంబ్‌లో ప్రతిభ చూపి.. ఒలింపిక్స్‌లో మెరవాలి






- రాష్ట్రస్థాయి మల్కంబ్ శిక్షకుల శిక్షణ శిబిరం ప్రారంభం
- ట్రినిటీ విద్యాసంస్థల్లో రెండు రోజుల శిక్షణ
- చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రాచీన భారతీయ విద్య అయిన మల్కంబ్‌ను తెలంగాణవ్యాప్తంగా విస్తరింపజేసి, విద్యార్థులను క్రీడల్లో ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ అన్నారు. చౌటుప్పల్‌లోని ట్రినిటీ విద్యాసంస్థల ప్రాంగణంలో తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రెండు రోజుల రాష్ట్రస్థాయి 'లెవెల్-1' ప్రాథమిక నియమ నిబంధనల శిక్షకుల శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సాధారణంగా పోలీసు శిక్షణలోనే మల్కంబ్ విద్య ఉంటుందని భావించేవారమని, అయితే ఇక్కడ ప్రతిభావంతులైన శిక్షకులను చూశాక క్రీడ భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉందనిపించిందన్నారు. ఈ శిక్షకులు తయారుచేసిన విద్యార్థులు భవిష్యత్తులో ఒలింపిక్స్ స్థాయికి ఎదిగి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. శిక్షకులు ప్రదర్శించిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. ట్రినిటీ విద్యాసంస్థల ఛైర్మన్ కేవీబీ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ సాహు, మల్కంబ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు, ట్రినిటీ డైరెక్టర్ కమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జని మంజుల, జనరల్ సెక్రటరీ ముదావత్ గోపాల్, ట్రెజరర్ పోలే అంజయ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన 42 మంది శిక్షకులు పాల్గొన్నారు.

# వైసీపీవి దిగజారుడు రాజకీయాలు: నిమ్మల రామానాయుడు



**విజయవాడ,తొలివెలుగు:** డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలను అడ్డుకోవడానికి గతంలో 356 పిటిషన్లు వేయించిన వైసీపీ, ఇప్పుడు నిరుద్యోగుల పేరుతో ఆందోళనలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో రూ. 2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఎస్సీపై జగన్ అండ్ కో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని, వారి కుట్రలకు ప్రభుత్వం తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు అభ్యర్థులు కష్టపడి కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధిస్తే, వైసీపీ మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా డీఎస్సీ వేస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పడమే కాకుండా... తన ఐదేళ్ల పాలనలో ఎందుకు ఉద్యోగాలు భర్తీ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న జగన్ వెంటనే వైసీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అన్నారు. చరిత్రలో 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు.

ప్రారంభమై పదేళ్లు గడిచాక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సాగే డిజిటల్ లావాదేవీలకు వడ్డింపు మొదలుకాబోతోంది. లోక్‌సభలో గురువారం గందర గోళం నెలకొన్నప్పుడు, ఎలాంటి చర్చా లేకుండా ఇందుకు సంబంధించిన బిల్లుఆమోదం పొందిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. తక్షణమే వర్తించకపోయినా భవిష్యత్తులో ఎప్పుడైనా యూపీఐ లావాదేవీలపై రుసుము వసూలు చేసేందుకు ఈ బిల్లు అధికారమిస్తోంది. ఫీజంటూ వసూలు చేస్తే రూ. 2,000కు మించిన లావాదేవీలపై, అది కూడా వార్షిక టర్నోవర్ కోటిన్నర మించే వ్యాపారులకే వర్తిస్తుందని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. విధించబోయే ఫీజు కూడా ఒక్కో లావాదేవీకి 0.25 శాతం లేదా 0.5 శాతం ఉండొచ్చన్నది మరో మాట. సాధారణ యూపీఐ వినియోగదారులు సాగించే లావాదేవీలన్నీ ఎప్పటిలా యథాతథంగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు




# ‘డిజిటల్’ భారం సరికాదు!

చెబుతున్నాయి. దీన్ని విశ్వసించలేం. ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పుడు ఆ చట్టానికి ముందూ మునుపూ సవరణలు రాబోవని చెప్పలేం. ఆ సంగతలావుంచి తమపై రుద్దే ఈ చార్జీల్ని వ్యాపారులు వినియోగదారుకే బదిలీ చేస్తారు. ఆ అవకాశం లేకుండా తగిన నియంత్రణలు విధిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా? దేశంలో ఆర్థిక సంస్కరణల ఆగమనంతోపాటే పాలకులు కొత్త రాగం అందు కున్నారు. ప్రభుత్వాలు పాలించాలి తప్ప వ్యాపారం చేయడమేమిటన్నదే దాని సారాంశం. ఆ వంకన లక్షలాదిమంది సిబ్బంది పనిచేసే దిగ్గజ పబ్లిక్ రంగ సంస్థలు అనేకం కనుమరుగయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచి, ఆసియాలోనే అతిపెద్దదైన నిజాం షుగర్స్ కాస్తా ఆనాటి సీఎం చంద్రబాబు పుణ్యమా అని మూతబడింది. కోట్లాది రూపాయల విలువైన దాని ఆస్తుల్ని కారుచవగ్గా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ మాదిరిగా మరెన్నో పబ్లిక్ రంగసంస్థలకు తాళాలుపడ్డాయి. వ్యాపారమంటే వదులుకున్నాయిగానీ... ప్రభుత్వాలకు వ్యాపార దృక్పథం పోలేదని యూపీఐ లావాదేవీలపై ఫీజు వసూలు ఆలోచన నిరూపిస్తోంది. యూపీఐ, రూపే వంటివి ఉచిత సేవలు అందించటంవల్ల తమవీసా, మాస్టర్‌కార్డ్ వగైరా ప్లాట్‌ఫాంలు ఎదగటంలేదన్న అమెరికా ఆక్రోశమే తాజా నిర్ణయానికి కారణమని కొందరి ఆరోపణ. బ్రెజిల్‌పై సైతం అమెరికా ఈ మాదిరి ఒత్తిడే తెచ్చినా అది అంగీకరించలేదని కూడా చెబుతున్నారు. వాటి నిజానిజాల సంగతలావుంచి, ప్రభుత్వం చెప్పే కారణాలు మాత్రం ఎప్పటినుంచో వింటున్నవే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ తడిసిమోపెడు భారమవుతున్నదని బ్యాంకులూ, పేమెంట్ ప్రాసెసర్లూ గగ్గోలు పెడుతుండటంవల్ల ఇది తప్పడం లేదట! లావాదేవీల నిర్వహణ భారంలోకొంతమేర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దాంతోపాటు ఈ లావాదేవీలు పెరిగాకబ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించుకోలేదా? ఆమేరకు వాటి ఖర్చు తగ్గలేదా? అదీగాక గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ సేవల చార్జీలు, కనీస మొత్తం ఖాతాలో లేదన్న కారణంతో వసూలు చేసే పెనాల్టీ, పరిమితికి మించిన లావాదేవీలపై చార్జీలు, ఎస్ఎంఎస్‌సందేశాలకని, డెబిట్ కార్డు నిర్వహణ వ్యయమని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవన్నీ చాలకనా ఈ కొత్త ఆలోచనలు! ఈ పదేళ్లలో డిజిటల్ లావాదేవీలు అపారంగా పెరిగాయి. అయినా ఈ పెరుగుదల తగినంతగా లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే వగైరాలు వినియోగిస్తున్నవారు వాటిని బ్యాంకింగ్ సేవలుగా చూడటం లేదు... ఆ యాప్‌లను పర్స్‌గా పరిగణించి లావాదేవీలు జరుపుకొంటున్నారు. అలవాటు చేసినట్టే చేసి,దాన్నుంచి కూడా ఆదాయం పొందాలనుకోవటం సరికాదు. ప్రస్తుతం దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగదారుల సంఖ్య 50 కోట్లని చెబుతున్నారు. అయితే ఒక వినియోగదారు సగటున చేసే లావాదేవీలు చూస్తే ప్రపంచ స్థాయికన్నా తక్కువే. అలాగే లావాదేవీల్లో 86 శాతం రూ.500, అంతకన్నా తక్కువ మొత్తాలేనని అంటారు. మొదట్లో ఉన్నంత వృద్ధి ఇటీవలి సంవత్సరాల్లో కనబడటం లేదని కూడా అంటున్నారు. ఇదంతా ఏం చెబుతోంది? ఎంతో వెసులుబాటుగా, ఉపయోగకరంగా ఉన్న ఈ లావాదేవీలు మరింత విస్తరించాల్సిన తరుణంలో వాటిని నిరుత్సాహపరిచేలా, జనం మళ్లీ నగదు వైపు మొగ్గేలా చేయటం వింతకాదా? ప్రభుత్వం ఆలోచించాలి.



# ‘సహజీవన’ హింస నేరమే!


సహజీవన బంధాల్లో క్రూరత్వాన్ని ఎదుర్కొనే మహిళలకు ఊరటనిచ్చేలా గృహహింస చట్టం పరిధిని విస్తరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వెలువరించిన తీర్పు మహిళలకు ఊరటనిస్తుంది. యుక్త వయసు వచ్చిన జంట పరస్పర అంగీకారంతో వివాహ వ్యవస్థ వెలుపల కూడా సహజీవనం సాగించవచ్చంటూ గతంలో న్యాయస్థానాలు పలు సందర్భాల్లో తెలిపాయి. అయినా ఇలాంటి బంధాలు తరచు వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా కొన్ని రాష్ట్రాల హైకోర్టులు వేర్వేరు కేసుల్లో ఈ బంధాల్లోని నైతికతను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. వివాహ బంధాల్లో ఉండే రక్షణలు సహజీవన బంధాల్లో ఉండబోవని హితోక్తులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ‘వివాహ స్వభావం కలిగిన’ సహజీవన బంధంలో ఉండే భాగస్వామి నుంచి మహిళ హింసను ఎదుర్కొంటే ఐపీసీ సెక్షన్ 498ఏ(బీఎన్ఎస్ సెక్షన్లు 85, 86) కింద కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. పరస్పర అవగాహన ద్వారా ఒక జంట సహజీవనం చేస్తున్నప్పుడు ఆమెను హింసించే పరిస్థితులు తలెత్తినప్పుడు చట్టం ఆమెకు రక్షణగా నిలబడాలి. ఇప్పుడు తాజా తీర్పువల్ల అలాంటి మహిళలకు భద్రత ఉంటుంది. నాలుగు దశాబ్దాల క్రితం చట్టం ఇంత స్పష్టంగా లేదు. అసలు మన చట్టాల్లో సహజీవన సంబంధాలకు ఎప్పుడూ చోటులేదు. కానీ 2005లో వచ్చిన గృహహింస నిరోధక చట్టం తొలిసారి ‘వివాహ స్వభావం’ కలిగిన సంబంధంలో ఉన్న మహిళ సమస్యలు ఎదుర్కొంటున్న పక్షంలో ఆమెను బాధిత పక్షంగా గుర్తించింది. ఆడ, మగ ఒకే ఇంట్లో కలిసివుంటూ జీవితభాగస్వాములన్న అభిప్రాయం సమాజంలో కలిగిస్తే, వారు పెళ్లీడుకొచ్చివుంటే, తగినంతకాలం శారీరక సంబంధంలో కొనసాగుతూవుంటే ఆ బంధాన్ని ‘వివాహ స్వభావం’గల బంధంగా గుర్తించవచ్చని సుప్రీంకోర్టు 2011లోనే ఒక కేసులో చెప్పింది. వారాంతాల్లో కలిసివున్నప్పుడు ఇది వర్తించబోదని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పు పెళ్లికానంత మాత్రాన ఒక బంధంలో కొనసాగే పురుషుడు మహిళను హింసిస్తుంటే 498ఏ వర్తించబోదనటం సరికాదని వివరించింది. చట్టంలోని ‘భర్త’ అనే పదాన్ని మరీ సంకుచితంగా తీసుకుని యాంత్రికంగా వర్తింపజేసి బాధిత మహిళకు న్యాయం చేయకపోవటం సరికాదని ధర్మాసనం చెప్పడం గమనించదగింది. లాంఛనంగా పెళ్లి ధ్రువీకరణ పత్రం లేనంతమాత్రాన ఆ బంధంలోని వివాహ స్వభావాన్ని గుర్తించకపోవటం, అక్కడ జరిగే హింసను విస్మరించటం సమాజ పురోగతికి తోడ్పడబోదని కూడా తెలిపింది. ఇద్దరు వ్యక్తులు సహజీవన బంధంలోకి వెళ్లి, వారి మధ్య తలెత్తే విభేదాలు మహిళను హింసించటానికి దారితీస్తే దాన్ని నేరంగా పరిగణించకపోవటం ఎలా చూసినా సరికాదు. సహజీవనంలోవుండే మహిళకు గృహహింస చట్టంకింద ఉన్న రక్షణలు సరిపోతాయనీ, అందువల్ల 498ఏ పరిధిని విస్తరించటం అనవసరమనీ ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదించినా ధర్మాసనం దీన్ని దృష్టిలో ఉంచుకునే తోసిపుచ్చింది. గృహహింస చట్టం కేవలం మనోవర్తి, పరిహారం, ఇంట్లో కొనసాగే హక్కువంటి సివిల్ ఉపశమనాలు మాత్రమే ఇస్తున్నదని... ఆ నేరానికి తగిన శిక్ష ఉండొద్దా అని న్యాయమూర్తులు ప్రశ్నించటం గమనార్హం. ప్రస్తుత కేసులో మహిళ తాను వివాహానికి సిద్ధపడే ఈ సహజీవన బంధంలోకి ప్రవేశించాననీ, కానీ అప్పటికే అతగాడికి పెళ్లయిన విషయాన్ని దాచాడనీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ కేసులోని నిజానిజాల్లోకి పోకుండానే మహిళా క్రూరత్వాన్ని చవిచూస్తుంటే 498ఏ వర్తించితీరాలని తెలిపింది.



# చందమామకు గాయం

అనుకున్నట్టే స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ నుంచి విడివడి అదుపుతప్పిన భాగం బుధవారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.05 నిమిషాలకు చంద మామను ఢీకొట్టింది. రాకెట్‌లోని అడుగుభాగం లోగడే సురక్షితంగా భూమ్మీదకు తిరి గొచ్చింది. అయిదంతస్తుల నిడివుండే రెండో భాగం మాత్రం దారితప్పింది. వాస్తవానికి ఇది కూడా పునర్వినియోగానికి వీలుగా రూపొందిందే. కానీ సరైన సమయంలో నియంత్రించకపోవటంవల్ల అది కాస్తా దారితప్పి చంద్రుడి కక్ష్యలోకి పోయింది. అంతరిక్షంలో మేం సైతం ఉన్నామని చెప్పుకోవటానికి అనేక దేశాలు పోటీపడి అంతరిక్ష నౌకలనూ, ఉపగ్రహాలనూ భూ కక్ష్యలో ప్రవేశపెడుతున్నాయి. అందువల్ల వాతావరణ పరిస్థితులు మొదలుకొని శాస్త్ర, సాంకేతిక, సైనిక రంగాల్లో ప్రగతి సాధించగలుగుతున్నాయి. కానీ ఈ ప్రయోగాల క్రమంలో అనుకోకుండా సంభవించగల ప్రమాదాలేమిటో చెప్పటానికి అదుపు తప్పిన ఫాల్కన్ 9 రాకెట్ విడి భాగమే తార్కాణం. నిరుడు జనవరిలో జరిపిన ఈ ప్రయోగం ఇది మినహా అన్నివిధాలా విజయవంతమైంది. అది గత 18 నెలలుగా భూమితోపాటు సూర్యచంద్రుల గురుత్వాకర్షణ శక్తికి లోనవుతూ, సౌరశక్తిని గ్రహిస్తూ సాగుతోంది. ఇది ఇలా క్రమేపీ వేగం పుంజుకుంటూ చంద్రుణ్ణి ఢీకొడుతుందని శాస్త్రవేత్తలు నిర్ధారణకొచ్చారు. ఎప్పుడు ఎక్కడ ఢీకొడుతుందో, ఏమేరకు దాని ప్రభావం ఉంటుందో కూడా అంచనా వేశారు. జరిగింది ప్రమాదమే అయినా... దాని గమనం గురించి శాస్త్రవేత్తలు వేసిన లెక్కలన్నీ కచ్చితత్వంతో ఉన్నాయని తేలింది. వేలాది సంవత్సరాలపాటు భూకక్ష్య విశాలంగా, శూన్యంగా ఉండిపోయింది. 1957లో అప్పటి సోవియెట్ నుంచి తొలిసారి నాలుగు రేడియో ఏంటెన్నాలున్న ఒక లోహపు బంతి పెనువేగంతో దూసుకెళ్లి భూకక్ష్యను చేరింది. అది అంతరిక్ష యుగానికి పడిన మొట్టమొదటి అడుగు. భూమ్మీద ఏం జరుగుతున్నదో తెలుసుకోవటానికి విప్పారిన తొలి అంతరిక్ష నేత్రం. మరో నాలుగైదేళ్లలో గుప్పెడు ఉపగ్రహాలు చకచకా అటువైపు కదిలి వెళ్లాయి. 70వ దశకం చివరికల్లా అవి 14,000కు చేరుకున్నాయి. 90ల చివరికి మరిన్ని ఉపగ్రహాలు పయనమయ్యాయి. అప్పటికల్లా వాటి సంఖ్య దాదాపు 20,000. ఇప్పుడిక ప్రైవేటు రంగం కూడా అంతరిక్షంవైపు చూడటం మొదలుపెట్టింది. ఇంకేం... వాటి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. పైగా గతంలో ఒక స్కూల్ బస్ సైజుకు మించని ఉపగ్రహాలు పంపే సంప్రదాయం ఉండగా... స్పేస్ ఎక్స్ మెగా బహుళ ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ఒరవడికి 2019లో శ్రీకారం చుట్టింది. తాజాగా 32,000 ఉపగ్రహాలు పెనువేగంతో సంచరిస్తున్నాయి. అదుపుతప్పి పడిపోయిన వాటిని మినహాయించగా తేలిన లెక్క ఇది. ఈ దశాబ్దం ముగిసేసరికి మొత్తం ఉపగ్రహాల సంఖ్య 60,000కు చేరుతుందని అంచనా. పాత ఉపగ్రహాల తాలూకు శకలాలు కావొచ్చు... విడివడిన రాకెట్‌ల తాలూకు తునకలు కావొచ్చు... ఉపగ్రహాల శకలాలు కావొచ్చు... పెను వేగంతో చక్కర్లు కొడుతున్నాయి. అవి దాదాపు 13 కోట్ల వరకూ ఉంటాయని అంచనా. ఇది మనుషులకూ ముప్పు తెస్తుందని కొందరు నిపుణులంటున్న మాట. మాజీ అంతరిక్ష యాత్రికుడు స్టీవ్ రాబిన్‌సన్ పలుమార్లు అంతరిక్ష యాత్రలు చేశాడు. ప్రతిసారీ తమ నౌకను ఏదో ఒక శకలం ఢీకొడుతూనే ఉండేదని ఆయన ఒక సందర్భంలో చెప్పాడు. గత నవంబర్‌లో చైనా అంతరిక్ష నౌకను ఆ దేశానికే చెందిన మరో ఉపగ్రహం తాలూకు శకలం ఢీకొట్టడంతో అది కాస్తా పనికిరాకుండా పోయింది. వ్యోమ గాముల్ని వెనక్కు తీసుకురావడానికి మరో నౌక పంపాల్సివచ్చింది. ఇలాంటి ప్రమాదాలపై 1972లోనే అంతర్జాతీయ ఒప్పందం కుదిరింది. పరిహారం ఎలా నిర్ణయించాలన్నది కూడా ఉంది. కానీ నిర్దిష్టంగా ఫలానా శకలంవల్లే ప్రమాదం జరిగిందని గుర్తించటం కష్టం. అందుకే లక్ష్యం పూర్తయ్యాక భూవాతావరణంలో పునఃప్రవేశించినప్పుడు వాటంతటవే ముగిసిపోయే ‘డిజైన్ ఫర్ డిమైజ్’ విధానంలో ఉపగ్రహాలు రూపొందుతున్నాయి. వీటితోపాటు నిర్దేశిత సముద్ర ప్రాంతాల్లో సురక్షితంగా కూల్చి వేసేలా ఆన్‌బోర్డ్ చోదనవ్యవస్థలూ వినియోగిస్తున్నారు. ఏదేమైనా ప్రపంచ దేశాలన్నీ అంతరిక్ష వ్యర్థాలపై దృష్టి పెట్టడం మంచిది. వాటి తొలగింపునకు లక్ష్యం నిర్దేశించుకుని పరిపూర్తి చేసుకోవటం ఉత్తమం.

# ఏఐ కంటే ‘హెచ్‌ఐ ఎందుకు ప్రత్యేకం’?



మీరు కేవలం ఒక కాలేజీ నుంచి పట్టా పొందడం కాదు, సమాజంలో మార్పు తీసుకురావాలనే ఒక గొప్ప ఉద్యమంలో భాగమై బయటకు అడుగుపెడుతున్నారు. ఇప్పుడు నేను ఈ రోజుల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన రెండు అక్షరాలు పలకబోతున్నాను: ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్). 2026లో అత్యంత వివాదాస్పదమైన అంశం జాతి, లింగం లేదా వలస పాలన కాదు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ అవుతుందని ఎవరు ఊహించారు? కానీ నేను నిజానికి ఏఐ గురించి మాట్లాడాలనుకోవడం లేదు. నేను మాట్లాడాలనుకుంటున్నది హెచ్‌ఐ (హ్యూమన్ ఇంటెలిజెన్స్-- మానవ మేధస్సు) గురించి. కృత్రిమ మేధ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చెందుతోంది. దాని శక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఏఐ శక్తి ఎంత పెరిగినా, మనుషులు అవసరం లేనివారిగా మారిపోరు. ప్రతి తరం ప్రపంచాన్ని మార్చేసే కొత్త సాంకేతిక విప్లవా లను చూసింది. ముద్రణ యంత్రం వచ్చింది. ఆవిరి యంత్రం వచ్చింది. విద్యుత్ వచ్చింది. ఇంటర్నెట్ వచ్చింది. ప్రతి కొత్త ఆవిష్కరణ ఒకవైపు ఆశ్చర్యాన్ని కలిగిస్తే... మరోవైపు భయాన్ని కూడా కలిగించింది. ఇప్పుడు వాటన్నింటికంటే పెద్ద మార్పును తీసుకొస్తున్న సాంకేతికతగా ఏఐ మన ముందుకు వచ్చింది. ఇది వ్యాసాలు రాయగలదు. సంగీతాన్ని సృష్టించగలదు. వ్యాధు లను గుర్తించగలదు. క్లిష్టమైన గణిత సమస్యలను పరిష్కరించ గలదు. వీడియోలను రూపొందించగలదు. మనుషుల్లా మాట్లాడగలదు. అందుకే చాలామంది ఒక ప్రశ్న అడుగు తున్నారు.



# నయా పల్సర్ వచ్చింది

**గరిష్ఠ ధర రూ.1.42 లక్షలు**

పూణె, : బజాజ్ ఆటో.. దేశీయ మార్కెట్‌కు నయా పల్సర్‌ను పరిచయం చేసింది. పల్సర్‌ను విడుదలై 25 ఏండ్లు పూర్తైన సందర్భంగా పల్సర్ ఎన్160 ఎస్, ఎన్160 ఎస్ఎస్ మాడళ్లను తీసుకొచ్చింది. వీటిలో ఎన్160 ఎస్ ధర రూ.1,33,511గా, ఎన్160 ఎస్ఎస్ ధరను రూ.1,42,585గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 4.5 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకులో గూగుల్ మ్యాప్ మిర్రరింగ్‌తో కూడిన 5 టీఎఫ్‌టీ ఉన్నది. ఇలాంటి టెక్నాలజీ అందుబాటులో ఉన్న తొలి దేశీయ స్పోర్ట్స్ బైకు ఇదే కావడం విశేషం.

# ఫైనాన్స్ షేర్లు ఢమాల్



ముంబై, ఆగస్టు 7: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రెండు రోజులుగా లాభాల్లో కదలాడిన సూచీలు.. తిరిగి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఇతర ఆర్థిక షేర్లలో పెట్టుబడులను మదుపర్లు ఉపసంహరించుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర మళ్లీ 80 డాలర్ల ఎగువకు చేరడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 455.59 పాయింట్లు లేదా 0.58 శాతం పతనమై 78,499.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 65.35 పాయింట్లు లేదా 0.27 శాతం క్షీణించి 24,570.65 వద్ద నిలిచింది. ఇంట్రా–డేలోనైతే 113.25 పాయింట్లు కోల్పోయింది. బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 5.90 శాతం నష్టపోయింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లూ మదుపర్లను ఆకట్టుకోలేక చతికిలపడ్డాయి. రంగాలవారీగా ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, హౌసింగ్ ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సూచీలు 1.33 శాతం నుంచి 0.61 శాతం వరకు మదుపర్లకు నష్టాలను పంచాయి. అయితే బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్‌లు 0.20 శాతం, 0.19 శాతం పెరిగాయి. హొర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రవాణాకు సంబంధించి జరుగుతున్న సంప్రదింపుల్లో మళ్లీ ప్రతిష్ఠంభన నెలకొన్నది. ఈ క్రమంలోనే ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. ఇక హౌతీల దాడులతో మిడిల్ ఈస్ట్ దద్దరిల్లుతున్న విషయం తెలిసిందే.

# ఐక్యతే మన బలం

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు. "1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.



# తగ్గిన పెట్రోల్ కార్ల అమ్మకాలు.. కారణం ఇదే!



భారతదేశంలో కార్లను కొనుగోలు చేస్తున్న వారిలో ఇంధన ఎంపికలు మారుతున్నాయి. ఫాడా విడుదల చేసిన జూలై 2026 రిటైల్ డేటా ప్రకారం.. పెట్రోల్/ఇథనాల్ కార్ల వాటా 41.68 శాతానికి తగ్గింది. జూన్‌లో ఇది 43.15 శాతంగా ఉండగా.. గతేడాది జూలైలో 47.62 శాతంగా ఉంది. మరోవైపు డీజిల్ కార్ల వాటా జూన్‌లో 16.32 శాతం నుంచి జూలైలో 17.73 శాతానికి పెరిగింది. గతేడాదితో పోలిస్తే డీజిల్ కార్ల వాటా కూడా స్వల్పంగా తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ20 పెట్రోల్‌పై వినియోగదారుల్లో ఉన్న సందేహాలు కూడా ఈ మార్పుకు ఒక కారణమని ఫాడా చెబుతోంది. పెట్రోల్/ఇథనాల్‌పై ఆసక్తి తగ్గుతున్న తరుణంలో.. సీఎన్జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. జూలైలో సీఎన్జీ వాహనాల వాటా 24.67 శాతం, హైబ్రిడ్ కార్ల వాటా 8.02 శాతం, ఈవీల వాటా 7.90 శాతంగా ఉంది. ఈ మూడు కలిపితే 40.59 శాతం మార్కెట్ వాటా వస్తుంది. అంటే పెట్రోల్/ఇథనాల్ వాహనాల కంటే కేవలం 1.09 శాతం పాయింట్లు మాత్రమే తక్కువ. దీన్నిబట్టి చూస్తే వాహన కొనుగోలుదారులు పెట్రోల్ ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు కూడా జూలైలో రికార్డు స్థాయికి చేరాయి. దేశవ్యాప్తంగా 3,27,901 ఈవీలు అమ్ముడైనట్లు నివేదిక వెల్లడించింది. ఇది మొత్తం ఆటో మార్కెట్‌లో 12.7 శాతం వాటా అన్నమాట. మొత్తం మీద డీజిల్ కార్ల వాటా పెరగడం కంటే.. పెట్రోల్/ఇథనాల్ నుంచి సీఎన్జీ, హైబ్రిడ్, ఈవీల వైపు వినియోగదారుల ఆసక్తి పెరగడమే ప్రధాన మార్పుగా కనిపిస్తోంది. రాబోయే పండుగల సీజన్‌లో ఈ ట్రెండ్ కొనసాగుతుందా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# భారత్‌కు వార్ సెగ



న్యూఢిల్లీ, ఆగస్టు 8: మిడిల్ ఈస్ట్‌లో అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం సెగ.. భారత్‌కు గట్టిగానే తగులుతున్నది. దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో దేశంలోకి దిగుమతైన ముడి చమురు విలువ 49 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాది ఇదే వ్యవధిలో 39 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. నిజానికి గతంతో పోల్చితే ఈసారి క్రూడాయిల్ దేశంలోకి తక్కువగానే వచ్చింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్–జూన్‌లో 73 మిలియన్ టన్నులు రాగా, ఈ ఏప్రిల్–జూన్‌లో 59.7 మిలియన్ టన్నులే దిగుమతైంది. అయినప్పటికీ 10 బిలియన్ డాలర్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఇందుకు కారణం గల్ఫ్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడి చమురు ధరలు, హొర్ముజ్ జలసంధిలో రవాణాకు అడ్డంకులేనంటున్నారు. పశ్చిమాసియా సంక్షోభం వల్లే 18 శాతం దిగుమతులు తగ్గినా.. 26 శాతం చెల్లింపులు పెరిగాయని పేర్కొంటున్నారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో హొర్ముజ్ జలసంధిలో రవాణా చిక్కుల్లో పడింది. అమెరికాకు సౌదీ, కువైట్, యూఏఈ, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలు అండగా ఉంటున్నాయన్న ఆగ్రహంతో ఇరాన్.. హొర్ముజ్ జలసంధిలో వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడులు చేస్తున్నది. దీంతో రవాణా సాగడం లేదు. ప్రపంచ ముడి చమురు సరఫరాల్లో హొర్ముజ్ మీదుగానే 20 శాతం జరుగుతున్నది. ఇక భారత్‌కు వచ్చే దిగుమతుల్లో దాదాపు 40 శాతం ఈ మార్గం గుండానే వస్తున్నది. కాగా, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో అక్కడ ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నది. దీంతో భారత్‌కు ముడి చమురు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతుండగా, డిమాండ్‌కు తగ్గ సైప్లె లేక ధరలూ పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ఆఖర్లో మొదలైన గల్ఫ్ వార్.. ఇప్పటికీ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఒకానొక దశలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 125 డాలర్లు పలుకడం గమనార్హం. హొర్ముజ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పెరుగుతున్న రవాణా ఖర్చులూ భారత్ వంటి భారీ చమురు దిగుమతి దేశాలకు పెను సమస్యగా పరిణమిస్తున్నాయి. గల్ఫ్ వార్ నేపథ్యంలో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లపైనే భారత్ ఆధారపడుతున్నది. ఏప్రిల్–జూన్‌లో టన్నుకు సగటున 2,408 డాలర్లు చెల్లించి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో యూఏఈ నుంచి సగటున 2,213 డాలర్లకు ఒక్కో టన్నును భారత్ దిగుమతి చేసుకున్నది. కాగా, దేశీయ ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 40 శాతానికిపైగానే ఈ ఏప్రిల్–జూన్‌లో నమోదైంది. 14.6 శాతంతో యూఏఈ రెండో స్థానంలో ఉండగా, తర్వాత స్థానాల్లో సౌదీ అరేబియా (9.9 శాతం), వెనెజువెలా (5.2 శాతం), ఒమన్ (4.5 శాతం) ఉన్నాయి. ఇదిలావుంటే రష్యాపై అమెరికా విధిస్తున్న ఆంక్షల ప్రభావంతో భారతీయ ఎగుమతులపై అమెరికాలో అదనంగా 100 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉన్నదని జీటీఆర్ఐ అంచనా వేస్తున్నది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఆపకపోతే టారిఫ్‌ల దెబ్బ ఖాయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నది.

# చాలు బంగారం.. చాలు




మరావతి: పసిడి ప్రియులకు పేరొందిన భారత దేశంలో బంగారం కొనుగోళ్లు, దిగుమతులు తగ్గిపోతున్నాయి. 2021--22 సంవత్సరంతో పోలిస్తే 2025--26 ఆర్థిక సంవత్సరంలో దిగుమతులు 17.23 శాతం క్షీణించాయి. 2021--22లో 868.4 టన్నుల బంగారం దిగుమతి కాగా.. 2025--26లో 718.74 టన్నులకు పడిపోయిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపింది. అంతర్జాతీయంగా భారీగా పెరుగుతున్న బంగారం ధరలకు తోడు రూపాయి విలువ పడిపోవడం, బంగారం కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు విధించడం దిగుమతులు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. బంగారం దిగుమతులను తగ్గించడానికి కేంద్రం ఈ ఏడాది మే నుంచి దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. మరోపక్క బంగారం కొనుగోళ్లు తగ్గించాలని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే పిలుపునివ్వడంతో అమ్మకాలపై గణనీయమైన ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బంగారం దిగుమతులు ఆరేళ్ల కనిష్ట స్థాయికి 120 టన్నులకు పరిమితమైనట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాని పిలుపుతో ఆభరణాల అమ్మకాలు 24 శాతం తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే పాత బంగారం అమ్మడం కూడా దిగుమతులు తగ్గడానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. ఇదే సమయంలో బంగారం ధరలు భారీగా పెరగడంతో స్మగ్లింగ్ పెరుగుతోంది. పరిమాణం పరంగా బంగారం దిగుమతులు తగ్గుతున్నా.. పసిడి దిగుమతుల బిల్లు మాత్రం భారీగా పెరిగిపోతోంది. 2021--22లో 868.4 టన్నుల దిగుమతికి ప్రస్తుత రూపాయి ధర ప్రకారం రూ.4,36,800 కోట్లు చెల్లించాల్సి వస్తే, 2025--26లో 718.74 టన్నులకు ఏకంగా రూ.6,88,320 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. అంటే దిగుమతులు తగ్గినా బిల్లు మాత్రం ఏకంగా 57.58 శాతం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం ఐదేళ్ల క్రితం ఔన్స్ బంగారం ధర 2,000 డాలర్లు ఉంటే ఇప్పుడది ఏకంగా 4,200 డాలర్లకు చేరడమే. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో పది గ్రాముల బంగారం ధర రూ.1.40 లక్షల నుంచి రూ.1.50 లక్షల మధ్య కదులుతోంది. బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో వినియోగదారులు తక్కువ బరువున్న ఆభరణాల కొనుగోలుకు మక్కువ చూపిస్తున్నట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

## అవును పెళ్లయ్యింది. నలుగురు పిల్లలు

విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై  కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడిన్లట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు.





## ఆసుపత్రి పాలైన అవికా గోర్..

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.


## సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద విషాదం..


బాలీవుడ్ అగ్రకథనాయకుడు సల్మాన్ ఖాన్ నివాసమైన ముంబై బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సల్మాన్ ఖాన్ భద్రత కోసం అక్కడ విధుల్లో ఉన్న 41 ఏళ్ల ముంబై పోలీసు కానిస్టేబుల్ గణేష్ రైతే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ముంబై పోలీసు విభాగంలోని ఎల్‌ఏ-4 యూనిట్‌కు చెందిన గణేష్ రైతే, శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గెలాక్సీ అపార్ట్‌మెంట్ వెలుపల పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన అశాంతి, ఛాతిలో అసౌకర్యంగా ఉన్నట్లు తోటి సిబ్బందికి తెలిపారు. క్షణాల వ్యవధిలోనే ఆయన ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన తోటి పోలీసులు వెంటనే ఆయన్ను సమీపంలోని భాభా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేసరికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతికి గల అసలు కారణాన్ని నిర్ధారించడానికి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా, గణేష్ రైతే గతంలో భారతీయ సైన్యంలో దేశ సరిహద్దులను కాపాడటంలో సేవలు అందించారు. ఆర్మీ సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ముంబై పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులలో, తోటి పోలీసు సిబ్బందిలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి తరచూ వస్తున్న బెదిరింపుల కారణంగా సల్మాన్ ఖాన్‌కు ప్రస్తుతం కట్టుదిట్టమైన వై-ప్లస్(-జూశ్రీబం) భద్రత కల్పించిన విషయం తెలిసిందే. ఈ భద్రతా వలయంలో భాగంగానే నిత్యం సల్మాన్ నివాసం వెలుపల పోలీసుల పహారా కొనసాగుతోంది. ఈ భద్రతా ఇబ్బందులపై గతంలో స్పందించిన సల్మాన్ ఖాన్, తనకు దేవుడిపై నమ్మకం ఉందని, ఎంత ఆయుష్షు ఉంటే అంత బతుకుతామని, చుట్టూ రక్షణ సిబ్బందితో తిరగడం ఒక్కోసారి కష్టంగా ఉంటుందని పేర్కొన్న సంగతి తెలిసిందే.



## రవితేజ 'ఇరుముడి' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాపై బజ్ క్రియేట్ చేసిన మేకర్స్.. ఇప్పుడు అతిపెద్ద ప్రమోషనల్ అప్‌డేట్‌కు సిద్ధమయ్యారు. అదే 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది.  ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్‌కు కేవలం కొద్ది రోజుల ముందు ఆగస్టు 12న ట్రైలర్‌ను విడుదల చేయడం ద్వారా ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.




Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com